క్లుప్తంగా

ఉపాధిహామీ కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ



ఓఆర్‌ఎస్ ప్యాకెట్లతో ఉపాధిహామీ కూలీలు

వాంకిడి: మండలంలోని నవెగూడ గ్రామ సమీపంలో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు మంగళవారం పంచాయతీ కార్యదర్శి రవి కుమార్ ఆధ్వర్యంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని పని ప్రదేశంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఉదయాన్నే వెళ్లి పనులు త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ మేట్‌లు శ్రీరామ్, గురువాస్, బాపూజీ, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి



ర్యాలీ తీస్తున్న ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

తిర్యాణి: నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం షేకు అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంలో నీటి ఆవశ్యకతపై అవగాహన కల్పించేలా ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ అవగాహన రహితంగా విచ్చలవిడిగా నీటిని వినియోగించడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందన్నారు.

డిగ్రీ పరీక్షఫీజు చెల్లించాలి

కాగజ్‌నగర్‌రూరల్: కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ చదువుతున్న రెగ్యులర్, బ్యాక్‌లాగ్ విద్యార్థులు 2వ సెమిస్టర్, 4వ సెమిస్టర్, 6వ సెమిస్టర్ పరీక్ష ఫీజులు ఈనెల 30వ తేదీలోగా చెల్లించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనరసింహం తెలిపారు. రూ.50ల అపరాధ రుసుముతో ఏప్రిల్ 10 వరకు చెల్లించుకునే అవకాశ ంఉందన్నారు.

రెండు సెల్‌ఫోన్‌ల అప్పగింత

కాగజ్‌నగర్‌రూరల్: ఈజీగాం పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న రెండు సెల్‌ఫోన్‌లను మంగళవారం బాధితులకు అప్పగించినట్లు ఈజీగాం ఎస్సై రామన్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఆరెగూడ గ్రామానికి చెందిన బోయిరె నరేశ్, కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ఎండీ ఫయాజ్‌లు ఫోన్లు పోగొట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి బాధితులకు అప్పగించామన్నారు. ఏఎస్సై హీరామన్, కానిస్టేబుల్ నయీం పాల్గొన్నారు.

ఉద్యానవన తోటలకు వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని జంబుగ ఉద్యానవనంలో గల మామిడి, నిమ్మతోటలకు మంగళవారం వేలం నిర్వహించారు. ఈ వేలం ద్వారా ఐటీడీఏకు రూ.లక్షా 53 వేల ఆదాయం వచ్చింది. వేలంలో పీహెచ్‌వో సుధీర్‌కుమార్, హార్టీకల్చర్ అధికారి శాంతిప్రియ, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సులు నిర్వహించాలి

కాగజ్‌నగర్‌రూరల్: జిల్లాలో ఉన్న సీనియర్ సిటిజన్‌లకు వారికి ఉన్న చట్టాలు, స్థితిగతులు, వైద్య సదుపాయాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని సీనియర్ సిటిజన్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ కోరారు. మంగళవారం పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనల ప్రకారం మూడు నెలలకోసారి సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈమేరకు జిల్లా సంక్షేమాధికారికి వినతిపత్రం సమర్పించినట్లు పేర్కొన్నారు. నాయకులు పూర్ణచందర్, నారాయణ, కలికోట రమణయ్య, మురళీధర్ రావు, ఎల్లాగౌడ్, వాహబ్, మూర్తి, దేవయ్య, ఉపేందర్, బాలరాజు, సీతారాం, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

ఆదిలాబాద్‌రూరల్: కుమురం భీం జిల్లా సిర్పూర్(టి) మండలంలోని ఇటికల్‌పహాడ్ గ్రామంలో గ్రామస్తులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలివ్వాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పూలే గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

‘ఉపాధి’లో మహిళలు!



గురుడుపేటలో ఉపాధిహామీ పనులు చేస్తున్న మహిళలు

- కూలీల్లో నగం మంది అతివలే
- జిల్లాలో మొత్తం జాబ్‌కార్డులు 1.23 లక్షలు
- సభ్యత్వం ఉన్న కూలీలు 2.47లక్షలు
- మహిళా కూలీలు 1,21,912 మంది

కౌటాల: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం గ్రామీణ కూలీలకు వరంగా మారింది. గతంలో గ్రామాల్లో పనులు లేకపోవడంతో చాలా మంది బతుకుదెరువు కోసం పట్టణాలకు వలస వెళ్లేవారు. ఉపాధిహామీ పథకం అమల్లోకి వచ్చిన తర్వాత చాలా మంది సొంత ఊళ్లల్లోనే పనులు చేసుకుంటూ అందుకు తగ్గ కూలి పొందుతున్నారు. ఉపాధిహామీ పథకంలో మహిళలు సత్తా చాటుతున్నారు. ఒక్కో కూలీకి ఏడాదికి 100 రోజులు పని కల్పించే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. అయితే ప్రస్తుతం గ్రామాల్లో హరితహారం నర్సరీల నిర్వహణ, మొక్కల సంరక్షణ తదితర పనులను ప్రభుత్వం ఈజీఎస్ కూలీలతోనే చేయిస్తుండడంతో ఏడాది పొడవునా వారికి ఉపాధి లభిస్తుంది.

ఉపాధి పనుల్లో ‘ఆమె’ సైతం..

ఉదయం వేళ పారా, పలుగు పట్టుకొని పురుషులతో పాటు మహిళలు సైతం కూలీ పనులకు వెళ్తున్నారు. తిరిగి మధ్యాహ్నం ఇంటికి చేరుకొని కుటుంబ పనులు చూసుకుంటున్నారు. మరికొందరు మహిళలు ఉదయం ఈజీఎస్ పనులకు వెళ్లి త్వరగా ముగించుకొని తర్వాత తమ సొంత వ్యవసాయ పనులకు వెళ్తున్నారు. ఉపాధి పనుల్లో మేట్లు కీలకపాత్ర పోషిస్తుంటారు. ఎంబీ రికార్డు నమోదులో కూలీల హాజరు, తదితర పనుల్లో వీరిది ప్రధాన పాత్ర. అయితే ఇప్పటివరకు సదరు పనుల్లో పురుషులను వినియోగించగా ప్రస్తుతం మహిళా కూలీల సేవలను సైతం వినియోగించుకుంటున్నారు. గతంలో కూలీల్లో ఒకరు సీనియర్ మేట్ బాధ్యత చూసేవారు. ప్రస్తుతం హాబిటేషన్‌కు ఒకరిని నియమించారు. ఎక్కడైనా మహిళలు అందుబాటులో లేనప్పుడే మగవారికి అవకాశం కల్పించారు.

ఏడాది పాటు పనులు..

గతంలో వేసవి కాలంలోనే పనులు అధికంగా ఉండేవి. కానీ ప్రతి పనికి ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగించుకుంటుండడంతో ఏడాది మొత్తం చేతినిండా పని ఉంటోంది. వానాకాలంలో హరితహారం మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం ఇలా ప్రతి పథకంలోనూ ఉపాధి కూలీలను వినియోగిస్తున్నారు. జిల్లాలో మొత్తం 1,23,423 ఉపాధిహామీ జాబ్‌కార్డులు ఉండగా వాటి పరిధిలో 2,47,870 మంది సభ్యత్వం కలిగి ఉన్నారు. వీరిలో 1,21,912 మంది మహిళలు ఉన్నారు.

ఊరిలోనే ఉపాధి



మా గ్రామంలో గత నెల రోజుల నుంచి ఉపాధిహామీ పనులు జోరుగా సాగుతున్నాయి. గ్రామంలోని వ్యవసాయ చేనులకు మట్టి రోడ్లు వేస్తున్నాం. దీంతో ఊరిలోనే ఉపాధి దొరుకుతుంది. ఏడాది కుటుంబమంతా ఉపాధి పనులకు వెళ్తాం. మాకు సీజన్‌లో చేతినిండా పని దొరుకుతుంది. పురుషులతో పాటు మేము కూడా ఉపాధి పనుల్లో చురుగ్గా పాల్గొంటున్నాం.

– బి. తుర్పబాయి, యాపలగూడ

మహిళలను ప్రోత్సహిస్తున్నాం..



గ్రామాల్లో ఉపాధిహామీ పనులు మహిళలకు వరంగా మారాయి. ఈ పనులు వారికి ఆర్థిక భరోసా ఇస్తున్నాయి. అన్ని గ్రామాల నుంచి పురుషులతో పాటు మహిళలు పనులకు ఎక్కువగా వస్తున్నారు. ఈజీఎస్ పనుల్లో మహిళా కూలీల హాజరు క్రమంగా పెరుగుతుంది. ఈ ఏడాది జరుగుతున్న పనుల్లో ఇప్పటి వరకు అధిక శాతం మహిళలే పాల్గొన్నారు. మహిళలు, యువకులు, రైతులు ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి.

– పూర్ణిమ, ఏపీవో, కౌటాల

రోడ్డు, వంతెన నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలి



డీఎఫ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న బంబార, గోండుకొసార గ్రామస్తులు

వాంకిడి: మండలంలోని బంబార గ్రామం నుంచి గోండుకొసార గ్రామం వరకు మంజూరైన బీటీ రహదారి నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరుతూ గ్రామస్తులు మంగళవారం జిల్లా అటవీశాఖ కార్యాలయంలో డీఎఫ్‌వో నీరజ్ టిబ్రెవాల్‌కు వినతిపత్రం అందజేశారు. గత వంద ఏళ్లుగా బంబార, గోండుకొసార, ఇంద్రానగర్ గ్రామాలకు ఇదే రోడ్డు గుండా ప్రయాణాలు సాగిస్తున్నామని, గతేడాది ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులతో 2 కిలోమీటర్ల రోడ్డు పనులు సైతం ప్రారంభం కాగా మధ్యలో ఉన్న వాగుపై వంతెన సైతం నిర్మించాల్సి ఉందని డీఎఫ్‌వో దృష్టికి తీసుకెళ్లారు. ప్రారంభమైన నిర్మాణ పనులను మండల అటవీశాఖ అధికారులు అనుమతుల పేరుతో నిలిపివేశారని తెలిపారు. దశాబ్దాలుగా సరైన రహదారి లేక, వాగుపై వంతెన లేక అత్యవసర సమయాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రభుత్వం నుంచి మంజూరైన రహదారి, వంతెన పనులకు అనుమతులు ఇవ్వాలని వినతిపత్రం ద్వారా కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాజీ సర్పంచులు అయ్యుబ్, కిష్టు, గ్రామస్తులు నేపాజీ, తదితరులు ఉన్నారు.

అసాంఘిక శక్తులకు సహకరించొద్దు



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ

దహెగాం: మారుమూల గ్రామాల ప్రజలు అసాంఘిక శక్తులకు సహకరించొద్దని కాగజ్‌నగర్‌రూరల్ సీఐ రాంబాబు అన్నారు. మంగళవారం మండలంలోని మారుమూల గిరిజన గ్రామం లోహాలో పర్యటించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట ఎస్సై రాజు, సిబ్బంది ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌటాల: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గల చీపురుదుబ్బ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ రవీందర్ సోమవారం తెలిపారు. మండలంలోని గురుడుపేట, కన్నెపల్లి, బోదంపల్లి, కనికి, యాపలగూడ గ్రామాలకు బుధవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. మండలంలోని ఆయా గ్రామాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొనసాగుతున్న ‘పది’ పరీక్షలు



విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల: కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి వార్షిక పరీక్షలు మంగళవారం కొనసాగాయి. విద్యార్థులను ఉపాధ్యాయులు పరీక్ష కేంద్రం వద్ద తనిఖీ చేసి కేంద్రంలోకి పంపించారు. జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 146 మంది విద్యార్థులకు గాను 146 మంది హాజరయ్యారని ఎంఈవో సోమయ్య తెలిపారు. జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 220 మంది విద్యార్థులకు గాను 220 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు.

నర్సరీలను పరిశీలించిన ఎంపీడీవో



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో సత్యనారాయణ

సిర్పూర్(టి): మండలంలోని డోర్‌పల్లి, కర్జపెల్లి గ్రామపంచాయతీల పరిధిలోని ఈజీఎస్ నర్సరీలను సిర్పూర్(టి) ఎంపీడీవో సత్యనారాయణ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో మొక్కలకు సరిపడా నీరు అందించి సంరక్షించాలని సూచించారు. వేసవిలో ఉపాధిహామీ కూలీలు ఉదయాన్నే పనులు ముగించుకోవాలని, మొక్కలకు సరిపడా నీటిని అందించాలన్నారు. అనంతరం నర్సరీలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

వాంకిడి: మండలంలోని కోమటిగూడ గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. ఫైనల్ పోరులో శాన్విక ఫర్టిలైజర్స్, లక్ష్మి ట్రెడర్స్ జట్లు తలపడగా శాన్విక ఫర్టిలైజర్స్ జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఆటలో గెలుపోటములు సహజమన్నారు. నిర్వాహకులు సానుర్లె పోచయ్య, తిరుపతి, బాలు, మధుకర్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి



మాట్లాడుతున్న సిడాం గణపతి

కౌటాల: వార్ధా నదిలో మునిగి మృతి చెందిన యువకుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ సిడాం గణపతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హోలీ సందర్భంగా తాటిపల్లి వద్ద నదిలో స్నానాలకు వెళ్లి యువకులు మృతి చెందడం విషాధకరమన్నారు. బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షల పరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీటీసీ దుర్గం మోతీరాం, నాయకులు నాగయ్య, సత్తయ్య, వెంకటేశ్, బండురావు, తదితరులు పాల్గొన్నారు.

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు



సాయి అంతిమయాత్రలో పాల్గొన్న గ్రామస్తులు

కౌటాల: హోలీ పండుగ సందర్భంగా మండలంలోని తాటిపల్లి వద్ద వార్ధా నదిలో స్నానాలకు వెళ్లి నదిలో మునిగి మృతి చెందిన నలుగురు యువకుల అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య జరిగాయి. సోమవారం రాత్రి ఎల్ములే ప్రవీణ్, పనస కమలాకార్ అంత్యక్రియలు నిర్వహించగా.. మంగళవారం ఉదయం ఆలం సాయి, ఉప్పుల సంతోశ్ అంత్యక్రియలను నిర్వహించారు. సోమవారం రాత్రి బాధిత కుటుంబ సభ్యులను సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, జెడ్పీ ఇన్‌చార్జి చైర్మన్ కోనేరు కృష్ణారావు పరామర్శించారు. మంగళవారం మాజీ జెడ్పీ చైర్మన్ సిడాం గణపతి, బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, ప్రజాప్రతినిధులు, నాయకులు పరామర్శించారు.

వ్యాపార నిర్వహణపై అవగాహన సదస్సు

కాగజ్‌నగర్‌రూరల్: సిర్పూర్ పేపర్ మిల్లు ఆధ్వర్యంలో భారతీయ యువశక్తి ట్రస్ట్ వారు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని కామర్స్ విద్యార్థులకు, యువతకు వ్యాపార నిర్వహణపై మంగళవారం అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.లక్ష్మీనరసింహం మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి సదస్సుల వల్ల భవిష్యత్తులో పారిశ్రామికవేత్తలుగా, వ్యాపారవేత్తలుగా ఎదగడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. భారతీయ యువశక్తి ట్రస్ట్ ప్రతినిధులు కునాల్, శంకర్, కామర్స్ సీనియర్ అధ్యాపకులు రాజు పాల్గొన్నారు.

రేపు సీజ్ చేసిన ఇసుక వేలం

రెబ్బెన: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఈనెల 22న మండలంలోని గొల్లగూడ, ఇందిరానగర్, రెబ్బెన గ్రామ పంచాయతీ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను సీజ్ చేయగా గురువారం మధ్యాహ్నం 3 గంటలకు వేలం వేయనున్నట్లు తహసీల్దార్ జ్యోత్స్న ఒక ప్రకటనలో తెలిపారు. గొల్లగూడ, ఇందిరానగర్, రెబ్బెన గ్రామ పంచాయతీల పరిధిలో అక్రమంగా నిల్వ చేసిన సుమారు 190 ట్రాక్టర్ల ట్రిప్పుల 570 క్యూబిక్ మీటర్ల ఇసుకను సీజ్ చేసిన రెవెన్యూ సిబ్బంది స్వాధీనం చేసుకొని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల పర్యవేక్షణలో గంగాపూర్ పశువుల సంత స్థలంలో నిల్వ చేసినట్లు తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొని ఇసుక పొందవచ్చన్నారు. ఇసుక సొంతం చేసుకున్న వ్యక్తులు వేలం డబ్బులను డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుందని తహసీల్దార్ తెలిపారు.

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ



తనిఖీ చేస్తున్న రామకృష్ణ

కాగజ్‌నగర్‌రూరల్: మండలం, పట్టణంలోని పలు ఎరువులు, విత్తన, పురుగుల మందుల దుకాణాలను మంగళవారం ఏవో రామకృష్ణ తనిఖీ చేశారు. డీలర్లు విధిగా లైసెన్సులు రెన్యూవల్ చేసుకోవాలని తెలిపారు. ఫర్టిలైజర్ స్టాక్స్ పీవోఎస్ మిషన్‌లో, గోడౌన్‌లో సమానంగా ఉండాలన్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. షాపులో ఉన్న స్టాక్ వివరాలను నోటీసు బోర్డుపై రాయాలని సూచించారు.

నిషేధిత ప్లాస్టిక్ విక్రయిస్తే చర్యలు

నస్పూర్: నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను ఎవరైనా దుకాణాదారులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ తెలిపారు. పట్టణ పరిధిలోని పలు దుకాణాదారులపై మంగళవారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రైడ్ నిర్వహించారు. పలు నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఫ్లడ్ కాలనీ వద్ద గల ఓ కిరాణ నిర్వాహకులకు రూ.1000జరిమానా విధించారు. అనంతరం పలు వాణిజ్య, వ్యాపారస్తులతో మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని నిషేధించినట్లు తెలిపారు. నిషేధిత ప్లాస్టిక్‌ను ఎవరూ విక్రయించరాదని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరసింహులు, సిబ్బంది పీ.పవన్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

‘గిరి’ గ్రామం.. అభివృద్ధికి దూరం



రాళ్లు రప్పలు తేలిన లైన్‌పటార్ రోడ్డు

- సమస్యలతో సతమతమవుతున్న లైన్‌పటార్
- రోడ్డు, రవాణా సౌకర్యాలు, పక్కా ఇళ్లు లేవు
- ఏళ్లుగా పట్టించుకోని అధికారులు



దాహం తీరుస్తున్న ఏకైక చేతిపంపు

కెరమెరి: మండలంలోని బాబేఝరి గ్రామ పంచాయతీ పరిధి లైన్‌పటార్ గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు ఏళ్లుగా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆదివాసీలు వాపోతున్నారు. గ్రామంలో 16 కుటుంబాలు ఉండగా, 102 జనాభా ఉంది. వీరంతా కొలాంల ఆదివాసీ తెగకు చెందిన వారు. జోడేఘాట్‌కు వెళ్లే దారిలో ఉన్న టోకెన్‌మోవాడ్ నుంచి 4 కిలో మీటర్ల దూరంలో ఉన్న గ్రామం సమస్యలతో సతమతమవుతుంది. ఏళ్లు గడుస్తున్నా గ్రామానికి రహదారి సౌకర్యం లేదు. బండరాళ్లు, రప్పలు తేలి నడిచేందుకు కూడా ఎంతో కష్టంగా ఉంది. గ్రామానికి మిషన్ భగీరథ రాక గ్రామంలోని ఏకైక చేతి పంపే వారికి దిక్కుగా మారింది.

అంగన్‌వాడీ, పాఠశాలలు లేవు..

గ్రామంలో సుమారు 10 మంది చిన్నారులు చదువుకు దూరంగా ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాల లేకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు తల్లిదండ్రుల వెంట పొలాలకు వెళ్తుంటే, మరి కొందరు చిన్నారులు ఇంటికి రక్షణగా ఇళ్లలోనే ఉంటున్నారు. అంతేగాక చిన్నారులు పౌష్టికాహారానికి దూరమవుతున్నారు.

రోడ్డు నిర్మించాలి



రోడ్డు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. మట్టి, రాళ్లరప్పల రోడ్డు ఉండడంతో నడవలేక పోతున్నాం. వానాకాలంలో గ్రామానికి రాకపోకలు నిలిచిపోతున్నాయి.

– ఆత్రం భీంరావు, గ్రామ పటేల్

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



లైన్‌పటార్ గ్రామ సమస్యలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ఫారెస్టు క్లియరెన్స్ లేకపోవడంతో రోడ్లు వేయలేకపోతున్నాం. నీటి సమస్య తీర్చడానికి ఉన్నతాధికారులో మాట్లాడాం.

– కృష్ణమూర్తి, ఎంపీడీవో

పశువులకు టీకాలతోనే ఆరోగ్యం



టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి శ్రీకాంత్

కౌటాల: పశువులకు టీకాలు వేస్తే ఆరోగ్యంగా ఉంటాయని మండల పశువైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. కౌటాల పశువైద్యశాల ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని వీర్దండి గ్రామంలో ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో భాగంగా ఆయన పశువులకు టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని తెలిపారు. సిబ్బంది సందీప్, ప్రకాశ్, రాజన్న, బిక్షపతి, శోభన్ తదితరులు పాల్గొన్నారు.